సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 10 । అక్టోబర్ । 2025



ఈసీ మార్గదర్శకాలను పాటించాలి
రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, నియమాలను అధికారులు, అభ్యర్థులు కచ్చితంగా పాటించాలని కలెక్టర్ సూచించారు.
- IIలో ▸



ప్రభుత్వ ఆస్పత్రుల్లో..
ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం చేయిచుకునేలా గర్భిణులను ప్రోత్సహించాలని జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్ సూచించారు.
- IIలో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.8 /21.0
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. అక్కడక్కడ మబ్బులు ఏర్పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు సీఎం రాక



నిజామాబాద్ సిటీ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి తల్లి ద్వాదశదిన కర్మ కార్యక్రమంలో సీఎం పాల్గొననున్నారు. హైదరాబాద్ నుంచి ముఖ్యమంత్రి హెలీకాప్టర్‌లో బయల్దేరి ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రానికి చేరుకుంటారు. కలెక్టరేట్ సమీకృత సముదాయం నుంచి కంఠేశ్వర్ బైపాస్‌లోని భూపతి రెడ్డి నివాసానికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శిస్తారు. మధ్యాహ్నం బోర్గాం (పి) సమీపంలోని భూమారెడ్డి కన్వెన్షన్‌లో జరిగే ద్వాదశదిన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం హైదరాబాద్ తిరి గి వెళతారు.

11న యథావిధిగా మద్యం దరఖాస్తుల స్వీకరణ

ఖలీల్‌వాడి : జిల్లాలోని మద్యం షాపుల దరఖాస్తులను ఈ నెల 11న రెండో శనివారం సైతం ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వీకరిస్తామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల కోసం జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో 8712658973 నెంబర్‌లో లేదా నేరుగా సంప్రదించాలన్నారు.

13న ప్రధాన మంత్రి అప్రెంటిస్ మేళా

నిజామాబాద్‌అర్బన్: ఈ నెల 13న ప్రధానమంత్రి అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఐటీఐలో ఈ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఐటీఐలో వివిధ కోర్సులు పూర్తిచేసి 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులు హాజరుకావాలన్నారు. తమ పేర్లను రిజిస్టర్ చేసుకొని సంబంధిత ధ్రువపత్రాలను తీసుకురావాలన్నారు. మేళాకు మహీంద్రా అండ్ మహీంద్రా, పార్కర్, డైనమిక్, తెలంగాణ ఆర్టీసీ, టాటా మోటార్స్, హుందాయ్ మోటార్స్, వరుణ్ మోటార్స్, సుఖ్‌జిత్ స్టార్చ్ మిల్ లాంటి కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి తైక్వాండో టోర్నీ

నిజామాబాద్‌నాగారం : ఎస్‌జీఎఫ్ అండర్–14 బాలబాలికల రాష్ట్రస్థాయి తైక్వాండో టోర్నీ శుక్రవారం జిల్లా కేంద్రంలోని బస్వాగార్డెన్‌లో ప్రారంభమవుతుందని క్రీడల కార్యదర్శి నాగమణి తెలిపారు. ఈ పోటీల్లో ఉమ్మడి 10 జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. టోర్నీకి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎస్‌జీఎఫ్ కార్యదర్శి డాక్టర్ ఉషారాణి హాజరవుతారని తెలిపారు.

మైనింగ్ డీడీ బాధ్యతలు స్వీకరణ

సుభాష్‌నగర్ : జిల్లా భూగర్భ, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా విజయ్‌కుమార్ రాథోడ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన ఆయనకు డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. ప్రభుత్వం ఇక్కడే డీడీగా పోస్టింగ్ ఇచ్చింది. కాగా, ఏడీగా ఎవరికీ పోస్టింగ్ ఇవ్వకపోవడంతో విజయ్‌కుమార్ రాథోడ్ ఇన్‌చార్జీగా కొనసాగనున్నారు. కొత్త వారికి పోస్టింగ్ ఇచ్చే వరకు ఆయన ఇన్‌చార్జి ఏడీగా ఉంటారు.

కొనసాగుతున్న నీటి విడుదల

బాల్కొండ : ఎగువ ప్రాంతాల నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి వరద నీరు కొనసాగుతుండటంతో వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల కొనసాగుతుంది. 60 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 16 వరద గేట్ల ద్వారా 50 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువకు 4 వేలు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వేలు, సరస్వతి కాలువ ద్వారా 650, మిషన్ భగీరథ ద్వారా 231, ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1090.90(80.05 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందన్నారు.

'సాగర్'లోకి 41 వేల క్యూసెక్కులు

నిజాంసాగర్(జుక్కల్): ఉమ్మడి జిల్లా వరప్రదాయిని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 41,680 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని అధికారులు గురువారం తెలిపారు. ఐదు గేట్లను ఎత్తి 41,680 క్యూసెక్కుల నీటిని మంజీరలోకి విడుదల చేస్తున్నారు.
ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం1405 అడుగులు(17.8టీఎంసీల) కాగా, 1405 అడుగుల(17.8టీఎంసీల) పూర్తిస్థాయి నీటిమట్టంతో ప్రాజెక్టు నిండుకుండలా ఉందని అధికారులు తెలిపారు.

ఇటు నిరాశ.. అటు ఆశ

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల నేపథ్యంలో.. పరిషత్ మొదటి విడత ఎన్నికలకు నామినేషన్ల దాఖలు మొదటి రోజే ఎన్నికలను నిలిపేస్తూ హైకోర్టు ఆదేశాలిచ్చింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బీసీ రిజర్వేషన్ల స్థానాలు అనుకూలంగా వచ్చిన పోటీదారులు తీవ్ర నిరాశలో పడిపోయారు. కోర్టు జోక్యంతో ఎక్కడ రిజర్వేషన్లు మారిపోతాయోనని ఆందోళన చెందుతున్నారు. మరోవైపు రిజర్వేషన్లు అనుకూలంగా రాని వారు కాలం కలిసి వస్తుందేమోనని ఆశాభావంతో ఎదురుచూస్తున్నారు.



- స్థానిక ఎన్నికలు నిలిపేస్తూ హైకోర్టు ఆదేశాలపై జిల్లాలో తీవ్ర చర్చ
- నామినేషన్లకు రంగం సిద్ధం చేసుకున్నవారికి చుక్కెదురు
- తమకు అనుకూలంగా రిజర్వేషన్లు రానివారిలో ఆశలు
- జనవరి వరకు ఎన్నికలకు బ్రేకు పడినట్లేనా.. పలువురి అంచనాలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : బీసీ రిజర్వేషన్ల నేపథ్యంలో అనేక మలుపులు తిరుగుతూ వచ్చిన స్థానిక సంస్థల ఎన్నికల అంశం మరిన్ని చర్చలకు తెరతీసింది. శాసనసభ తీర్మానం, గవర్నర్ వద్ద ఫైల్ పెండింగ్, ప్రభుత్వం జీవో విడుదల చేయడం, ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకటించడం, మొదటి విడత నోటిఫికేషన్ ఇవ్వడం, హైకోర్టుకు వెళ్లడం.. ఇన్ని పరిణామాల మధ్య వివిధ వర్గాల్లో అనేక రకాల చర్చలు జరిగాయి. ఎవరి విశ్లేషణ వారిదే అన్నట్లుగా కథ నడిచింది. చివరకు హైకోర్టు ఆదేశాలతో ఎన్నికలకు బ్రేకు పడింది. పరిషత్ మొదటి విడత ఎన్నికలకు నామినేషన్ల దాఖలు మొదటి రోజే ఎన్నికలను నిలిపేస్తూ ఉన్నత న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు పేర్కొంది. మరో రెండు వారాల్లో పిటిషనర్ కౌంటర్ ఇవ్వాలంది. దీంతో ఎన్నికల ప్రక్రియ మరింత ఆలస్యం అవుతోంది. వచ్చే జనవరిలో మాత్రమే ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాలు అంచనాలు వేస్తున్నాయి.



సాలూర మండల పరిషత్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాటు చేసిన కౌంటర్లు

వెనుతిరిగిన అభ్యర్థులు..

మాక్లూర్–2 ఎంపీటీసీ స్థానానికి ఒకరు నామినేషన్ దాఖలు చేశారు. సాయినేని వెంకేశ్వరరావు అనే అభ్యర్థి ముహూర్తం చూసుకుని భారీగా అనుచరులతో తరలివచ్చి నామినేషన్ వేశారు. అయితే అప్పటికే కోర్టు స్టే ఇచ్చిందని తెలియడంతో నిరాశ చెందాడు. అదేవిధంగా కొత్తపల్లి ఎంపీటీసీ స్థానానికి కాంగ్రెస్ నుంచి చంద్రయ్య, మాక్లూర్ ఎంపీటీసీ–2 స్థానంలో బీజేపీ అభ్యర్థి సురేష్‌నాయక్ నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చి కోర్టు స్టేతో దాఖలు చేయకుండానే తిరిగి వెళ్లిపోయారు.

రిజర్వేషన్ల విషయం..

స్థానిక ఎన్నికల అంశం మొత్తం బీసీ రిజర్వేషన్ల చుట్టూ తిరుగుతుండగా, తాజాగా కోర్టు ఆదేశాలతో కొందరిలో నిరాశ, మరికొందరిలో ఆశలు పెరుగుతున్నాయి. ఆయా ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీల స్థానాలకు రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చిన వారు బరిలో దిగేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. వారిలో తాజాగా కోర్టు తీర్పుతో నిరాశ నెలకొంది. మరోవైపు రిజర్వేషన్ల కారణంగా తమకు పోటీ చేసే అవకాశం రాలేదని నిరాశ చెందుతున్నవారిలో మళ్లీ ఆశలు చిగురించాయి. మళ్లీ రిజర్వేషన్లు మారాతాయా అంటూ చర్చోపచర్చలు జరుగుతున్నాయి.

అంతా ఇదే చర్చ..

మహారాష్ట్రలో గతంలో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యాక, ఫలితాలు ప్రకటించిన తరువాత సైతం సదరు ఎన్నికలను సుప్రీంకోర్టు రద్దు చేయడంతో ఆయా పార్టీల నాయకుల్లో తీవ్రమైన చర్చ జరిగింది. ప్రస్తుతం తాజాగా వచ్చిన కోర్టు ఆదేశాలకు ముందు వరకు కూడా రిజర్వేషన్లు ఉంటాయా.. మారతాయా, నామినేషన్లు వేసినప్పటికీ ఎన్నికలు సజావుగా జరుగుతాయా.. లేదా, డబ్బులు ఖర్చు చేసుకుని ఎన్నికల్లో విజయం సాధిస్తే ఈ ఎన్నికలను కోర్టు అంగీకరిస్తుందా.. రద్దు చేస్తుందా అనే విషయంలో తర్జనభర్జన పడ్డారు. ఈ నేపథ్యంలోనే హైకోర్టు ఎన్నికలను నిలిపేయడంతో ఆశావహులు నిర్వేదం చెందుతున్నారు.

నామినేషన్లు దాఖలు..

జిల్లాలో మొదటి విడతలో గురువారం 18 మండలాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ నామినేషన్ల స్వీకరణ మొదలు పెట్టింది. డిచ్‌పల్లి జెడ్పీటీసీకి ఒక నామినేషన్ దాఖలైంది. అదే మండలంలో రెండు ఎంపీటీసీ నామినేషన్లు దాఖలయ్యాయి. కోటగిరి మండలంలో నాలుగు ఎంపీటీసీ స్థానాలకు నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. మాక్లూర్ మండలంలో ఒక ఎంపీటీసీ నామినేషన్ దాఖలైంది. మోపాల్ మండలంలో ఒక ఎంపీటీసీ స్థానానికి నామినేషన్ దాఖలైంది. బోధన్ రెవెన్యూ డివిజన్‌లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

అధిక ఆదాయం.. అత్యధిక పోటీ

- జిల్లాలో పలు మద్యం దుకాణాలకు క్రేజీ
- గతంలో ఒక్కో వైన్స్‌కు 53 నుంచి 112 వరకు దరఖాస్తులు
- సెప్టెంబర్ వరకు లిక్కర్ ద్వారా రూ.18.85 కోట్ల నుంచి రూ.35 కోట్ల ఆదాయం

ఖలీల్‌వాడి: రాష్ట్రప్రభుత్వం 2025–2027 వరకు మద్యం షాపుల నిర్వహణకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. రూ. 3లక్షల చలాన్‌తో సెప్టెంబర్ 26 నుంచి ఎక్సైజ్ అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 102 మద్యం షాపులు ఉన్నాయి. అయితే, గతంలో పలు వైన్ షాపులకు వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ప్రస్తుతం కూడా వాటికే అధిక డిమాండ్ ఉంటుందని ఎక్సైజ్ వర్గాలు భావిస్తున్నాయి. రెండేళ్ల కాలపరిమితిలో రూ.కోట్లలో వ్యాపారం జరగడంతో వ్యాపారులు అధిక ఆదాయం వచ్చే మద్యం షాపులపైనే ఎక్కువగా దృష్టి పెడుతున్నారు. వాటిని దక్కించుకునేందుకు గ్రూపులుగా ఏర్పడి దరఖాస్తులు చేసేందుకు సిద్ధమవుతున్నారు. నగరానికి చెందిన ఓ యువకుడు వివిధ గ్రూపులతో కలిసి సుమారు 50 వరకు దరఖాస్తులు చేస్తున్నట్లు తెలిసింది.

అత్యధిక దరఖాస్తులు..

జిల్లాలో 12 వైన్ షాపులకు 2023, 2024 సంవత్సరంలో ఎక్కువగా దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు. మానిక్‌భండార్‌లోని మద్యం షాపుకు 112 దరఖాస్తులు రాగా, సెప్టెంబర్ వరకు లిక్కర్ విక్రయం ద్వారా రూ.26 కోట్ల ఆదాయం వచ్చింది. దీంతో ఈసారి మరో వైన్స్‌కు అవకాశం కల్పించారు. కాగా, ఇదే ప్రాంతంలో బార్ రావడంతో గతంమాదిరిగా ఈ వైన్స్‌కు దరఖాస్తులు వస్తాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో అత్యధిక ఆదాయం వచ్చిన మద్యం దుకాణాలివే.. (రూ.కోట్లు)

ప్రాంతం	వచ్చిన దరఖాస్తులు	లిక్కర్ ద్వారా వచ్చిన ఆదాయం
మోపాల్	110	20.15
ఏర్గట్ల	104	28.60
మారుతీనగర్	70	35.10
వేల్పూర్	67	22.75
ఇందల్వాయి–1	63	24.05
మోర్తాడ్–2	62	24.05
ఆర్ఆర్ చౌరస్తా	62	22.75
మారుతీనగర్–1	57	28.60
మారుతీనగర్–5	56	19.50
మారుతీనగర్–4	55	18.85
మారుతీనగర్–3	53	20.15
మాక్లూర్	53	20.15
జన్నెపల్లి	53	24.70

18 వరకు గడువు

మద్యం దుకాణాల దరఖాస్తులకు ఈ నెల 18 న సాయంత్రం 5 గంటల వరకు అవకాశం ఉంది. గతంలో గడువు ముగింపు దశలో అత్యధిక దరఖాస్తులు వచ్చాయి. ఈసారీ అదే మాదిరిగా దరఖాస్తుదారులు అత్యధిక సంఖ్యలో వస్తాయని భావించిన ఎక్సైజ్ అధికారులు వ్యాపారులకు ఇబ్బందులు కలుగకుండా ఆర్మూర్ ప్రాంత దరఖాస్తులను నిజామాబాద్ ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో స్వీకరించేందుకు ఏర్పాట్లు చేశారు. గురువారం సాయంత్రం వరకు 102 దుకాణాలకు 88 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి వెల్లడించారు.



స.హ. చట్టం పకడ్బందీగా అమలు చేయాలి



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, తదితరులు

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్: సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. స.హ. చట్టం ప్రవేశపెట్టి 20 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమాన్ని నిజామాబాద్ కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు.

సమాచార హక్కు చట్టం అమలుపై రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేయించిన ప్రతిజ్ఞలో అన్ని శాఖల పీఐవో, ఏపీఐవోలు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సమాచార చట్టాన్ని పక్కాగా అమలు చేస్తూ, నిజామాబాద్ జిల్లాకు కూడా అవార్డులు సాధించి ప్రత్యేక గుర్తింపు తేవాలని కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ సందీప్, ఏవో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలను మోసగిస్తున్న కాంగ్రెస్, బీజేపీ



వేల్పూర్: కాంగ్రెస్, బీజేపీలు కలిసి బీసీలను మోసగిస్తున్నాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై గురువారం ఆయన స్పందిస్తూ ప్రకటన విడుదల చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 50 శాతం కంటే ఎక్కువ రిజర్వేషన్ ఇవ్వాలంటే 10వ షెడ్యూల్‌లో చేర్చి రాజ్యాంగ సవరణ తప్పనిసరి చేయాలన్న వాస్తవం తెలిసి కూడా కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీలను కాంగ్రెస్ మోసగించిందన్నారు. రాజ్యాంగ సవరణ కోసం 22 నెలలుగా ఢిల్లీలో పోరాటం చేయకుండా కాంగ్రెస్ గల్లీలో మాత్రం డ్రామాలు ఆడిందన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నా చేసినప్పుడు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఇలా ఏ ఒక్కరూ రాలేదన్నారు.ప్రధానమంత్రి మోదీ కూడా కాంగ్రెస్‌తో కలిసి బీసీ రిజర్వేషన్లు పెరగకుండా చూస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీలో కాంగ్రెస్ నిజాయితీగా పోరాటం చేస్తే తాము కూడా వారితో కలిసి పనిచేస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు రిజర్వేషన్ల పెంపుపై చిత్తశుద్ధితో పని చేయాలని డిమాండ్ చేశారు.

సిజేరియన్‌లు తగ్గించాలి

- నిబంధనలను పాటించని స్కానింగ్ సెంటర్లను మూసేస్తాం
- వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ రాజశ్రీ



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజశ్రీ


నిజామాబాద్‌నాగారం : ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్‌లు తగ్గించాలని, ప్రతి ఆస్పత్రికి బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, పొల్యూషన్ సర్టిఫికెట్ తప్పనిసరి అని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ రాజశ్రీ తెలిపారు. గురువారం సిజేరియన్ శస్త్ర చికిత్సలపై ఆడిట్ టీం సభ్యులు, సంబంధిత అధికారులతో తన చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులన్నీ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ క్రింద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అన్ని ఆస్పత్రుల్లో గర్భిణులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, ముఖ్యంగా కూర్చోడానికి కుర్చీలు, తాగునీటి, టాయిలెట్ వసతులు, అదేవిధంగా వాహనాల కోసం పార్కింగ్ స్థలాన్ని, ఫైర్ ప్రమాద నివారణ వసతి కలిగి ఉండాలన్నారు. రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, టారిఫ్ చార్జీల చార్ట్‌ను వెయిటింగ్ హాలులో ప్రదర్శించాలన్నారు. అనవసర సిజేరియన్ శస్త్ర చికిత్సలను నివారించాలని, ఆర్ఎంపీలు, పీఎంపీలకు పర్సంటేజీల ఆశ చూపుతూ అనవసర సిజేరియన్ శస్త్ర చికిత్సలను చేయరాదన్నారు. ప్రతి ఆస్పత్రిని మూడు నెలలకు ఒకసారి వెరిఫై చేయాలన్నారు. ప్రతినెల 300 ఆస్పత్రులను ఎంక్వయిరీ చేయాలని అన్నారు. అనవసర అబార్షన్లు కూడా చేయరాదన్నారు. జిల్లాలో 176 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని, ప్రతి స్కానింగ్ సెంటర్లో అర్హులైన రేడియాలజిస్ట్ ద్వారానే స్కానింగ్ నిర్వహించాలన్నారు. వైద్యులు కాని వారి ద్వారా వచ్చిన రిఫరల్ స్లిప్పులతో స్కానింగ్ చేయరాదన్నారు. అందుకు విరుద్ధంగా స్కానింగ్ చేస్తే ఆ స్కానింగ్ సెంటర్లను మూసివేస్తామని హెచ్చరించారు. సమీక్షలో ఆర్మూర్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్వేత, డాక్టర్ సుప్రియ, డాక్టర్ అశ్విని వివిధ పీహెచ్సీల వైద్యాధికారులు, పర్యవేక్షక సిబ్బంది, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

వరద కాలువకు గండి

పెద్దవాగులో కలుస్తున్న నీరు



పరిశీలిస్తున్న అధికారులు



పెద్దవాగులో కలిసిపోతున్న నీరు

మోర్తాడ్(బాల్కొండ) : మోర్తాడ్ మండలం గాండ్లపేట శివారులోని వరద కాలువ అక్విడెక్ట్‌కు గండి పడటంతో వరద కాలువ నీరు పెద్దవాగులో కలిసిపోయింది. బుధవారం అర్ధరాత్రి తర్వాత ఊహించని రీతిలో వరద కాలువకు కింది భాగంలో గండి ఏర్పడింది. పెద్ద వాగు వద్ద నిర్మించిన అక్విడెక్టు ముగిసిన తర్వాత సిమెంటు గోడను నిర్మించారు. వరద కాలువ ప్రవాహం తట్టుకునే విధంగా నిర్మాణాన్ని 2020లో పూర్తి చేశారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి మిగులు జలాలు మిడ్ మానేరుకు వరద కాలువ ద్వారా విడుదల చేస్తున్నారు. గోదావరి నదిలోకి నీరు వదిలేందుకు బదులుగా వరద కాలువ ద్వారా విడుదల చేస్తుండడంతో ప్రవాహం విపరీతంగా పెరిగింది. వరదనీటి ఉధృతికి అక్విడెక్ట్ కింది భాగంలో గుంత ఏర్పడి నీరంతా పెద్ద వాగులోకి చేరింది. మొదట ఒడ్డువైపు నీటి ప్రభావం పెరిగిపోయింది. ఈ సమాచారం అందుకున్న చీఫ్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చక్రపాణి తదితరులు వరద కాలువకు నీటి మళ్లింపును ఆపివేశారు.నీటి ప్రవాహం ఉండడంతో జగిత్యాల వైపు వెళ్లిన నీరు కూడా గాండ్లపేట వైపు మళ్లింది.

అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే

వరద కాలువ అక్విడెక్ట్ నీరు పెద్దవాగులో ప్రవహిస్తున్న తీరుపై అధికారులతో ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. వరద కాలువకు గండి ఏర్పడడానికి ప్రధాన కారణం గుర్తించి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రాజెక్టు వరద కాలువ విభాగం ఇంజనీర్లతో పాటు మోర్తాడ్ తహసీల్దార్‌తో మాట్లాడి కాల్వకు గండిపడటం వల్ల పంటలకు ఏమైనా నష్టం జరిగితే గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందించాలని కోరారు.

కాకతీయ కాలువ కట్ట భద్రమేనా !

- ప్రమాదకరంగా కాలువ కట్ట
- ఏళ్లతరబడి ప్రతిపాదనలు.. లభించని మోక్షం

బాల్కొండ : శ్రీ రాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటి సరఫరా చేసే కాకతీయ కాలువ కట్ట భద్రతపై ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గాండ్లపేట్ వద్ద వరద కాలువ అక్విడెక్ట్‌కు గండి పడిన నేపథ్యంలో.. కాకతీయ కాలువ పరిస్థితి కూడ అధ్వానంగా ఉందంటున్నారు. కాకతీయ కాలువ జీరో పాయింట్ వద్ద గత కొంతకాలంగా కట్ట కుంగుతోంది. దీంతో కాలువ కట్టను సిమెంట్ బస్తాల్లో ఇసుక నింపి అడ్డుగా వేశారు. మరమ్మతుల కోసం రూ. 10 లక్షలు మంజూరై రెండేళ్లు గడుస్తున్నా పనులు చేపట్టడం లేదు. అదేవిధంగా పోచంపాడ్ శివారులో వాటర్ ట్యాంక్ వద్ద కాకతీయ కాలువ కట్ట మరింత ప్రమాదకరంగా ఉంది. వాటర్ ట్యాంక్ నుంచి మిగులు నీటిని కాలువలోకి మళ్లించుటకు పైపు వేశారు. దీనివల్ల కాలువ కట్ట మరింత కోతకు గురైంది. కాలువ కట్టకు ఇది వరకే గండి ఏర్పడింది. మరింత పెద్దగా గండి పడితే కాలువ నీరు పోచంపాడ్ కాలనీలోకి వెళ్లే ప్రమాదం ఉంది. అదేవిధంగా కాకతీయ కాలువ పొడవునా సిమెంట్ లైనింగ్ ధ్వంసం కావడంతో కాలువ కట్ట ప్రమాదకరంగా మారింది. కాలువకు గండి పడక ముందే మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..

కాకతీయ కాలువ మరమ్మతుల కోసం ప్రభుత్వానికి పలు మార్లు ప్రతిపాదనలు పంపించాం. ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదు. దీంతో పనులు చేపట్టలేక పోయాం. నిధులు మంజూరు కాగానే పనులను చేపడుతాం.
– రఘుపతి, డిప్యూటీఈఈ, కాకతీయ కాలువ



కాకతీయ కాలువ కట్టపై ఇసుక బస్తాలు



కట్ట ధ్వంసమైన కాకతీయ కాలువ

క్లుప్తంగా

పనులను వేగవంతం చేయాలి



సిరికొండ: విద్యుత్‌ సరఫరాకు సంబంధించి మరమ్మతు పనులను వేగవంతం చేయాలని ఎస్‌ఈ రవీందర్‌ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని పెద్ద వాల్గోట్‌, చిన్న వాల్గోట్‌, కొండూర్‌ గ్రామాల్లో ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలకు విద్యుత్‌శాఖకు జరిగిన నష్టాన్ని ఎస్‌ఈ గురువారం పరిశీలించారు. డిచ్‌పల్లి డీఈ కామేశ్వర్‌రావు, ఏడీఈ శ్రీనివాస్‌, ఏఈ చంద్రశేఖర్‌ ఉన్నారు.

ఇంటిగ్రేటెడ్‌ పీజీ పరీక్షల ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ ఇంటిగ్రేటెడ్‌ కోర్సులు (అప్లయిడ్‌ ఎకనామిక్స్‌, ఇంటిగ్రేటెడ్‌ ఫార్మాస్యూటికల్‌ కెమిస్ట్రీ) 7, 9వ సెమిస్టర్‌ థియరీ, ప్రాక్టికల్‌ పరీక్షల ఫీజును ఈ నెల 23 వరకు చెల్లించాలని కంట్రోలర్‌, ప్రొఫెసర్‌ సంపత్‌ కుమార్‌ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో ఈ నెల 25 వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఏపీఈ అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.500లు, ఐపీసీహెచ్‌ అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.600 లు పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని విద్యార్థులకు సూచించారు.

బీసీలను మోసం చేసేందుకు కాంగ్రెస్‌ కుట్ర

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేశ్‌



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: రాజ్యాంగ నిబంధనలు, కోర్టు అడ్డంకులు వస్తాయని తెలిసినప్పటికీ కాంగ్రెస్‌ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి.. బీసీ రిజర్వేషన్ల విషయమై కుట్రపూరితంగా వ్యవహరించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేశ్‌ ఆరోపించారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్ని అంశాలు తెలిసినప్పటికీ, బీసీ సంఘాలు మొత్తుకున్నప్పటికీ జీవో నంబర్‌9 జారీ చేసి ఇష్టం వచ్చినట్లు నాటకమాడారన్నారు. తమిళనాడులో జయలలిత హయాంలో న్యాయపరమైన చిక్కులు రాకుండా చేసుకున్నారన్నారు. ఇక్కడ మాత్రం అలాంటి ప్రయత్నం చేయకుండానే బీసీలను, తెలంగాణ ప్రజలను మోసం చేసేందుకు కుట్ర చేశారన్నారు. కాంగ్రెస్‌ను బీసీలు, తెలంగాణ ప్రజలు ఇకపై నమ్మరన్నారు.

విద్యుత్‌ తీగలు తగిలి చెరుకు తోట దగ్ధం

మద్నూర్‌(జుక్కల్‌): విద్యుత్‌ తీగలు తగలడంతో మండలంలోని దన్నూర్‌ శివారులో సాగవుతున్న చెరుకు తోట దగ్ధమైనట్లు బాధితుడు దేవ్‌కత్తే మారుతి తెలిపారు. గురువారం ప్రమాదవశాత్తు చెరుకుతోటకు విద్యుత్‌ తీగలు తగలడంతో మంటలు వ్యాపించాయని పేర్కొన్నారు. మద్నూర్‌ ఫైర్‌ సిబ్బంది రంగంలోకి దిగి మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో రూ.1.50 లక్షల పంట నష్టం జరిగిందని, సకాలంలో వచ్చి రూ.2.50 లక్షల విలువజేసే పంటను కాపాడినట్లు అగ్నిమాపక అధికారి మాధవ్‌ తెలిపారు. సిబ్బంది హరీశ్‌, సంతోష్‌, సహదేవ్‌ ఉన్నారు.

13న జిల్లాస్థాయి కబడ్డీ, వాలీబాల్‌ పోటీలు

నిజామాబాద్‌నాగారం: ఎస్‌జీఎఫ్‌ అండర్‌-14 బాలబాలికల విభాగంలో కబడ్డీ, వాలీబాల్‌ జిల్లాస్థాయి పోటీలు ఈ నెల 13న నిర్వహించనున్నట్లు క్రీడల కార్యదర్శి నాగమణి గురువారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పాత కలెక్టరేట్‌ మైదానంలో పోటీలు ఉంటాయన్నారు. ప్రతిభ చూపిన వారిని ఈ నెల 16న సంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. వివరాలకు 9347216426 నెంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఈసీ మార్గదర్శకాలను పాటించాలి

- కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి
- మోస్రా, చందూర్‌, రుద్రూర్‌ మండలాల్లో నామినేషన్ల ప్రక్రియ పరిశీలన

వర్ని(చందూరు)/ రుద్రూర్‌: రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ మార్గదర్శకాలు, నియమాలను అధికారులు, అభ్యర్థులు కచ్చితంగా పాటించాలని కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి సూచించారు. గురువారం మోస్రా, చందూర్‌, రుద్రూర్‌ మండల కేంద్రాల్లో ఎంపీటీసీల నామినేషన్‌ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలయ్యేలా అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా జిల్లా స్థాయి అధికారులను సంప్రదించాలని సూచించారు.నామినేషన్ల స్వీకరణ కేంద్రా ల్లో సరిపడా సిబ్బంది ఉన్నారా లేదా అని అడిగి తె లుసుకున్నారు. నోటీసు బోర్డుపై ప్రదర్శించిన నోటిఫికేషన్‌ పత్రాలను పరిశీలించారు. పొరపాట్లకు తావులేకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. నామినేషన్లకు సంబంధించిన అఫిడవిట్‌లను ఏరోజుకు ఆరోజు నోటీసు బోర్డుపై ప్రదర్శిస్తూ, జిల్లా కేంద్రానికి రిపోర్టు పంపాలని సూచించారు. కలెక్టర్‌ వెంట బోధన్‌ సబ్‌ కలెక్టర్‌ వికాస్‌ మహతో, రుద్రూర్‌ ఎంపీడీవో భీమ్‌రావ్‌, తహసీల్దార్‌ తారాబాయి తదితరులు ఉన్నారు.



మోస్రాలో నోటిఫికేషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి

మెనూ ప్రకారం భోజనం అందించాలి

వర్ని (చందూర్‌): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం చందూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్‌ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, తేడా వస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న డైనింగ్‌ హాల్‌ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని పంచాయతీరాజ్‌ అధికారులకు ఫోన్‌ ద్వారా ఆదేశించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎఫ్‌ఆర్‌ఎస్‌ ద్వారా హాజరు తీసుకున్నారా లేదా అన్నది పరిశీలించారు.



చందూర్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్‌

26 నుంచి తీర్థయాత్రలకు ప్రత్యేక రైళ్లు

- జనవరి వరకు దేశీయ ఎయిర్‌ ప్యాకేజీ
- ఐఆర్‌సీటీసీ టూరిజం అసిస్టెంట్‌ మేనేజర్‌ పీవీ వెంకటేశ్‌ వెల్లడి

నిజామాబాద్‌నాగారం: తీర్థయాత్రలకు వెళ్లే వారి కోసం రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చిందని ఐఆర్‌సీటీసీ టూరిజం అసిస్టెంట్‌ మేనేజర్‌ పీవీ వెంకటేశ్‌ తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడారు. ఈ నెల 26 నుంచి నవంబర్‌ 4వ తేదీ వరకు ప్రత్యేక రైళ్లు, అక్టోబర్‌ నుంచి జనవరి వరకు దేశీయ ఎయిర్‌ ప్యాకేజీలను హైదరాబాద్‌ నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. భవ్య గుజరాత్‌ తీర్థయాత్రలో భాగంగా ద్వారకాదీష్‌ మందిరం, నాగేశ్వర జ్యోతిర్లింగ మందిరం, బేట్‌ ద్వారక, సోమనాథ్‌ జ్యోతిర్లింగ మందిరం, సబర్మతి ఆశ్రమం, సూర్యదేవాలయం, రాణికివావ్‌, స్టాచ్యూ ఆఫ్‌ యూనిటీ ప్రాంతాలను సందర్శన ఉంటుందని పేర్కొన్నారు. ఒక్కొక్కరికి సాధారణ టికెట్‌ ధర రూ.18,400(స్లీపర్‌), రూ. 30,200 (3 ఏసీ), రూ. 39,900 (2ఏసీ) అని తెలిపారు. రైలు, బస్సు, హోటల్‌, భోజన సదుపాయం కల్పిస్తామని వివరించారు. దేశీయ ఎయిర్‌ ప్యాకేజీలో భాగంగా అండమాన్‌, కశ్మీర్‌, కర్ణాటక, రాజస్థాన్‌, ఒడిశా, తమిళనాడులోని పలు ప్రాంతాల్లో ఆరు లేదా ఏడు రోజుల యాత్ర ఉంటుందని పేర్కొన్నారు. ప్రాంతాల మేరకు రూ.34,950 నుంచి రూ.56,625 వరకు చార్జీలు ఉంటాయన్నారు. అంతర్జాతీయ ఎయిర్‌ ప్యాకేజీలో భాగంగా థాయ్‌లాండ్‌, శ్రీలంక, దుబాయ్‌ దేశాల సందర్శన ఉంటుందని, అందులో భాగంగా ఒక్కొక్కరికి రూ.64,500 నుంచి రూ.1,12,250 వరకు చార్జీలు ఉంటాయని తెలిపారు. వివరాలకు 9701360701, 9281030711 నెంబర్లను సంప్రదించాలన్నారు. సమావేశంలో టూరిజం మానిటర్లు నరేశ్‌బాబు ఓర్సు, కొక్కుల ప్రశాంత్‌ పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న పీవీ వెంకటేశ్‌

యువత పొగాకుకు దూరంగా ఉండాలి

- డీఎంహెచ్‌వో రాజశ్రీ

నిజామాబాద్‌నాగారం: విద్యార్థులు, యువత ప్రతి ఒక్కరూ పొగాకు దూరంగా ఉంటూ, మంచి మార్గంలో ఉన్నత శిఖరాల వైపు నడవాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టొబాకో ఫ్రీ యూత్‌ క్యాంపెయిన్‌ కార్యక్రమాన్ని గురువారం అర్సపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ 60 రోజులపాటు జిల్లాలో టొబాకో ఫ్రీ యూత్‌ క్యాంపెయిన్‌ నిర్వహిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలలన్నీ టొబాకో ఫ్రీగా గుర్తించడం, కనీసం 30 టొబాకో ఫ్రీ గ్రామాలుగా గుర్తించడం జరుగుతుందన్నారు. పొగాకు ఉత్పత్తులను అక్రమంగా విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా సైకియాట్రిస్ట్‌ డాక్టర్‌ రవితేజ మాట్లాడుతూ విద్యార్థులు పాన్‌, గుట్కా, సిగరెట్‌, డ్రగ్స్‌ లాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. పొగాకు ఉత్పత్తులు, డ్రగ్స్‌ తీసుకుంటే శారీరక, మానసిక అనారోగ్యాలు, రుగ్మతలు సంభవిస్తాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఎంఈవో ఆర్‌వీఎస్‌ గౌడ్‌, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్‌ డాక్టర్‌ సామ్రాట్‌ యాదవ్‌, మెడికల్‌ ఆఫీసర్‌ శ్రావణ లక్ష్మి, ఆర్‌బీఎస్‌కే వైద్యులు విజయభాస్కర్‌, జిల్లా సైన్స్‌ అధికారి కస్తూరి గంగాకిషన్‌ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

నగరంలో నేడు ట్రాఫిక్‌ ఆంక్షలు

ఖలీల్‌వాడి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం నిజామాబాద్‌ నగరానికి రానున్న సందర్భంగా ట్రాఫిక్‌ ఆంక్షలు విధిస్తున్నట్లు ట్రాఫిక్‌ ఏసీపీ మస్తాన్‌ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి ట్రాఫిక్‌ ఆంక్షలు, దారిమళ్లింపు ఉంటుందని పేర్కొన్నారు. బోధన్‌, ఆర్మూర్‌, బాన్సువాడ, భైంసాతోపాటు గ్రామాల నుంచి వచ్చే ప్రజలు డైవర్షన్లను గమనించి తమ ప్రయాణాలు చేయాలన్నారు. మాధవనగర్‌ బైపాస్‌, కంఠేశ్వర్‌ బైపాస్‌, అర్సపల్లి, ఆర్‌ఆర్‌ ఎక్స్‌రోడ్‌, ఫులాంగ్‌, రుక్మిణి చాంబర్‌, బోర్గాం(పి) బ్రిడ్జి ప్రాంతాల్లో ట్రాఫిక్‌ ఆంక్షలు ఉంటాయని తెలిపారు. వాహనదారులు, ప్రజలు ప్రత్యామ్నాయ రూట్లలో రాకపోకలు సాగించాలని సూచించారు.

దుబ్బాక పాఠశాలలో సెల్‌ఫోన్‌ చిచ్చు

- విద్యార్థికి టీసీ ఇచ్చిన హెచ్‌ఎం
- నిరసన తెలిపిన బంజారా నాయకులు

నిజామాబాద్‌అర్బన్‌: పాఠశాలకు సెల్‌ఫోన్‌ తీసుకొచ్చాడని విద్యార్థికి టీసీ ఇచ్చిన ఘటన ధర్పల్లి మండలం దుబ్బాక ఉన్నత పాఠశాలలో చోటు చేసుకుంది. దసరా సెలవులకు ఒకరోజు ముందు ఈ ఘటన జరగగా గురువారం స్థానిక బంజారా సేవా సంఘం నాయకుల ఆందోళనతో వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా.. పాఠశాలలో బతుకమ్మ కార్యక్రమాలు నిర్వహించిన రోజు 8వ తరగతి విద్యార్థి సెల్‌ఫోన్‌ తీసుకొచ్చాడు. గమనించిన ప్రధానోపాధ్యాయురాలు శశికళ విద్యార్థి నుంచి ఫోన్‌ తీసుకుంది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ఫోన్‌ ఇవ్వాలని అడగగా, విద్యార్థి పాఠశాలకు ఫోన్‌ తీసుకురావడం సరైన విధానం కాదని, ఫోన్‌ ఇవ్వనంటూ చెప్పింది. ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా, హెచ్‌ఎం సెల్‌ఫోన్‌ను ధర్పల్లి పోలీస్‌ స్టేషన్‌లో అప్పగించారు. అనంతరం ఆ విద్యార్థికి టీసీ ఇచ్చారు. విషయం తెలుసుకున్న బంజారా సేవా సంఘం నాయకులు గురువారం పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. విద్యార్థి తల్లిదండ్రులను హెచ్‌ఎం దుర్భషలాడిందని, విద్యార్థికి టీసీ ఇవ్వడం సమంజసం కాదని, వెంటనే ఆమెపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ విషయమై హెచ్‌ఎం శశికళను వివరణ కోరగా.. విద్యార్థి మరోసారి ఇలాంటి తప్పిదం చేయకుండా బుద్ధి చెప్పేందుకు తల్లిదండ్రులు, గ్రామపెద్దల సమక్షంలో సెల్‌ఫోన్‌ ఇస్తానని తెలిపానని, అయినా వారు వినకుండా ఫోన్‌ ఇవ్వకుంటే తన పేరిట ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించారని తెలిపారు. దీంతో తాను భయపడి ధర్పల్లి పోలీస్‌ స్టేషన్‌ను ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. విద్యార్థి ప్రవర్తనను దృష్టిలో పెట్టుకొని టీసీ మంజూరు చేసినట్లు తెలిపారు.



దుబ్బాక పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు, బంజారా సంఘం నాయకులు

విద్యార్థికి కౌన్సెలింగ్‌ ఇస్తాం

పాఠశాలకు సెల్‌ఫోన్‌ తీసుకురాకుండా విద్యార్థికి కౌన్సెలింగ్‌ ఇప్పిస్తాం. టీసీ వాపస్‌ తీసుకోవాలని ప్రధానోపాధ్యాయురాలికి ఆదేశాలిచ్చాం. పాఠశాలలో ఎలాంటి ఇబ్బందులు లేవు.

– అశోక్‌, డీఈవో

పలుచోట్ల నామినేషన్ల దాఖలు

- ఏర్పాట్లు చేసిన అధికారులు
- కోర్టు తీర్పుతో వెనుదిగిరిన అభ్యర్థులు



కంచెట్టి గంగాధర్‌ వేసిన నామినేషన్‌ పత్రాలను పరిశీలిస్తున్న రిటర్నింగ్‌ ఆఫీసర్‌ కృష్ణవేణి



మోపాల్‌లో నామినేషన్‌ దాఖలు చేస్తున్న విద్యాసాగర్‌



ఎడపల్లి ఎంపీడీవో కార్యాలయం ఎదుట పోలీసు బందోబస్తు

బోధన్‌ /డిచ్‌పల్లి /మోపాల్‌ /రుద్రూర్‌ /మాక్లూర్‌: స్థానిక సంస్థల ఎన్నికల తొలి విడత నోటిఫికేషన్‌ గురువారం ఉదయం విడుదలైంది. దీంతో అప్పటికే ఆయా మండలాల అధికారులు నామినేషన్ల స్వీకరణకు కేంద్రాలను ఏర్పాటు చేశారు. డిచ్‌పల్లి, మోపాల్‌, కోటగిరి, మాక్లూర్‌ మండలాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు పలువురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. డిచ్‌పల్లిలో జెడ్పీటీసీ స్థానానికి మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్‌, మిట్టాపల్లి ఎంపీటీసీ స్థానానికి అంబటి శైలజ (కాంగ్రెస్‌), నడిపల్లి- 2 ఎంపీటీసీ స్థానానికి మాజీ సర్పంచ్‌ పాశం లావణ్య (కాంగ్రెస్‌) నామినేషన్‌ దాఖలు చేశారు. మోపాల్‌ మండలంలోని న్యాల్‌కల్‌ ఎంపీటీసీ స్థానానికి అసది విద్యాసాగర్‌ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్‌ దాఖలుచేశారు. అంతకుముందు నామినేషన్‌ దాఖలు కేంద్రాలను అదనపు కలెక్టర్‌ (స్థానిక సంస్థలు) అంకిత్‌ పరిశీలించారు. కోటగిరి-1 ఎంపీటీసీ స్థానానికి మూడు, కోటగిరి-2 స్థానానికి ఒక్క నామినేషన్‌ దాఖలైంది. కాగా, సాయంత్రం స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేస్తూ ఈసీ ప్రకటించడం విశేషం. మాక్లూర్‌-2 ఎంపీటీసీ స్థానానికి గురువారం సాయంత్రం నాలుగున్నర గంటలకు సాయినేని వెంకటేశ్వరరావు నామినేషన్‌ దాఖలు చేశారు. మంచి ముహూర్త సమయాన్ని ఎన్నుకొని అనుచరులతో తరలివచ్చి నామినేషన్‌ వేశారు. అప్పటికే కోర్టు నాలుగు వారాలు స్టే ఇచ్చిందని తెలియడంతో కంగుతిని వెళ్లిపోయారు. కొత్తపల్లి ఎంపీటీసీ అభ్యర్థిగా చంద్రయ్య, మాక్లూర్‌ ఎంపీటీసీ-2 స్థానానికి బీజేపీ అభ్యర్థి సురేశ్‌నాయక్‌ సైతం నామినేషన్‌ వేసేందుకు వచ్చి వెనుదిరిగారు.



మాక్లూర్‌లో నామినేషన్‌ దాఖలు చేస్తున్న వెంకటేశ్వర్‌ రావు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరిగేలా చూడాలి

డిచ్‌పల్లి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం చేయించుకునేలా గర్భిణులను ప్రోత్సహించాలని జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్‌ సూచించారు. సాధారణ ప్రసవంతో కలిగే లాభాలు, శస్త్ర చికిత్సతో కలిగే నష్టాలను గర్భిణులకు వివరించాలన్నారు. డిచ్‌పల్లి సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆశా కార్యకర్తల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కీటక జనీత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి తొలగించాలన్నారు. జ్వరానికి సంబంధించి రక్త పరీక్షలు చేయాలని, సీజనల్‌ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆశా కార్యకర్తలు కచ్చితంగా గర్భిణులతో ఫోలిక్‌ యాసిడ్‌(ఐరన్‌) మాత్రలు తినిపించాలని ఆదేశించారు. సమావేశంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి షారోన్‌ షైని క్రిస్టినా, వైద్యులు రాజశ్రీ, మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్‌, ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్‌ అలీ, దేవపాలం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్‌ తుకారాం రాథోడ్‌



సమావేశంలో పాల్గొన్న ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు

క్రైం కార్నర్‌

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

బాన్సువాడ: పట్టణంలోని సంగమేశ్వర కాలనీలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్‌ చేసినట్లు సీఐ అశోక్‌ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు జగన్నాథం సతీశ్‌ ఇంటిపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. రూ.24,500 నగదు, సెల్‌ఫోన్లు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

చెరువులో పడి మహిళ మృతి



గాంధారి (ఎల్లారెడ్డి): మండల పరిధిలోని పెద్ద పోతంగల్‌ గ్రామ సమీపంలోని గిద్ద చెరువులో గురువారం ప్రమాదవశాత్తు పడి దుర్కి సాయవ్వ (40) మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. సాయవ్వ భర్త ప్రసాద్‌కు ఇద్దరు భార్యలు. ఆయన మొదటి భార్యతో కలిసి నిజాంసాగర్‌లో ఉంటున్నాడు. సాయవ్వ ఇటీవల కూతురుకు పెళ్లి చేసి పెద్దపోతంగల్‌లో ఒంటరిగా నివసిస్తోంది. గురువారం ఉదయం బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందింది. మృతురాలి కూతురు సౌందర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దోమకొండలో ఇద్దరు అదృశ్యం



నర్సింలు(ఫైల్‌)



చిట్యాల నవీన్‌ (ఫైల్‌)

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన ఇద్దరు అదృశ్యమైనట్లు ఎస్సై స్రవంతి తెలిపారు. దోమకొండకు చెందిన మాసుల నర్సింలు గురువారం మధ్యాహ్నం గేదెలను మేపడానికి వెళ్తు న్న అని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. రాత్రి తిరిగి ఇంటికి రాలేదు. ఆచూకీ లభించక పోవడంతో నర్సింలు భార్య లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇదే మండల కేంద్రానికి చెందిన చిట్యాల నవీన్‌ అనే వ్యక్తి గురువారం ఉదయం కుటుంబంలో గొడవల కారణంగా ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. రాత్రయినా తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. ఈమేరకు అతడి భార్య రాధిక పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

నిజామాబాద్‌నాగారం: స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ అండర్‌-14 బాలబాలికల విభాగంలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా తైక్వాండో జట్టును బుధవారం రాత్రి ఎంపిక చేశారు. ఎంపిక పోటీలను క్రీడల కార్యదర్శి నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించారు. 200 మంది వరకు క్రీడాకారులు రావడంతో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. పీఈటీలు ఈశ్వర్‌, శ్రీధర్‌, అజ్మత్‌ఖాన్‌, తైక్వాండో కోచ్‌లు వినోద్‌నాయక్‌, మనోజ్‌ పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో క్రీడల కార్యదర్శి

డ్రంకెన్‌ డ్రైవ్‌లో ఒకరికి జైలు

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలో గురువారం డ్రంకెన్‌డ్రైవ్‌ చేపట్టినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్‌ తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన మహమూద్‌ ఖాన్‌ మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. కోర్టులో హాజరుపర్చగా సెకండ్‌క్లాస్‌ మెజిస్ట్రేట్‌ గంగాధర్‌ ఏడు రోజుల జైలు శిక్ష విధించారు.

టేకు చెట్ల చోరీలో ఇద్దరి అరెస్టు



నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

మాక్లూర్‌: వ్యవసాయ క్షేత్రం నుంచి టేకు చెట్లను కోసి అపహరించుకుపోయిన దొంగలను మాక్లూర్‌ పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై రాజశేఖర్‌ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆగస్టు 19న మండలంలోని మెట్‌పల్లి-వల్లభాపూర్‌ గ్రామాల మధ్యలో ఉన్న గోపాల్‌ శ్రీధర్‌ వ్యవసాయ క్షేత్రం నుంచి దొంగలు 20 టేకు చెట్లను మిషన్‌తో కోసి దుంగలను ఎత్తుకెళ్లారు. యజమాని శ్రీధర్‌ పోలీసులకు ఫిర్యాదు చేయగా, నార్త్‌ జోన్‌ సీఐ శ్రీనివాస్‌, ఎస్సై రాజశేఖర్‌ దర్యాప్తు చేపట్టారు. చెట్లను అపహరించిన జావేద్‌, మహమ్మద్‌ అబ్బాస్‌లను అరెస్టు చేసి వారి నుంచి రూ.95 వేల విలువజేసే టేకు కలపను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

రేషన్‌ డీలర్‌పై కేసు నమోదు



గండివేట్‌లో రేషన్‌ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని గండివేట్‌ గ్రామంలో రేషన్‌ బియ్యం పంపిణీలో అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. దీంతో సంబంధిత రేషన్‌డీలర్‌పై గురువారం 6ఏ కేసు నమోదు చేసినట్లు ఆర్‌ఐ ప్రదీప్‌ తెలిపారు. కొన్ని రోజులుగా రేషన్‌ డీలర్‌ గంగ వేధిత వినియోగదారులకు బియ్యం పంపిణీ చేయలేదని తెలిపారు. గురువారం పౌరసరఫరాల డీటీ సురేశ్‌ దుకాణాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించగా 150 క్వింటాళ్ల సన్నబియ్యం, 66 క్వింటాళ్ల దొడ్డురకం బియ్యం తేడా వచ్చిందన్నారు. దీంతో డీలర్‌పై కేసు నమోదు చేసి మరో డీలర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చినట్లు తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరికి ఏడు నెలల జైలు

కామారెడ్డి క్రైం: తాడ్వాయి మండలం సంగోజీవాడి గ్రామంలో ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన ఇద్దరు నిందితులకు కామారెడ్డి కోర్టు ఏడు నెలల జైలు శిక్ష విధించింది. గత ఫిబ్రవరి 20న గ్రామానికి చెందిన గడ్డం రాజవ్వ ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. మరుసటి రోజు చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. దొంగలు పడినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదే గ్రామానికి చెందిన రాజశేఖర్‌ ఇంట్లో సైతం చోరీ జరిగిందని పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు అన్ని కోణాల్లో విచారణ జరిపి నిందితులను అదే గ్రామానికి చెందిన దోమకొండ అనిల్‌, గడ్డం బాల్‌రాజులుగా గుర్తించారు. వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. అప్పటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. నేరం రుజువు కావడంతో కామారెడ్డి అడిషనల్‌ జ్యుడిషియల్‌ ఫస్ట్‌క్లాస్‌ మెజిస్ట్రేట్‌ బట్టు దీక్ష నిందితులకు 7 నెలల జైలు శిక్ష, రూ.200 చొప్పున జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువరించారు. నిందితులకు శిక్షపడేలా కృషి చేసిన ఏపీపీ రజిని, కేసును సక్రమ పద్ధతిలో విచారణ చేపట్టిన ఎస్సైలు వెంకటేశ్వర్లు, మురళీ, లైజనింగ్‌ అధికారి రామేశ్వర్‌రెడ్డి, సతీశ్‌గౌడ్‌ను ఎస్పీ అభినందించారు.

భూ కబ్జాలో ఏడుగురిపై..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కన్నాపూర్‌ శివారులో అటవీ భూమిని కబ్జా చేసుకోవడానికి ప్రయత్నించిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దీపక్‌కుమార్‌ తెలిపారు. అటవీ ప్రాంతంలో ఈ నెల 5న చెట్లను నరికివేసి, విధులకు ఆటంకం కలిగించిన ఎల్లేశం, భూమయ్య, వెంకటి, కవిత, సంతోష్‌, ధరత, సుజాతలపై అటవీ శాఖ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మోసగించిన గల్ఫ్‌ ఏజెంట్‌పై..

మోపాల్‌: మండలంలోని బాడ్సి గ్రామానికి చెందిన బోధకుంట పోశెట్టిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జడ్‌ సుస్మిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోశెట్టి ఐదు నెలల క్రితం బోధన్‌లోని రాకాసీపేట్‌కు చెందిన ప్యాట విజయ్‌కుమార్‌ను మలేసియాకు పంపించాడు. కంపెనీ వీసా ఉందని అబద్ధాలు చెప్పి డబ్బులు తీసుకున్నాడు. తీరా అక్కడికి వెళ్లిన తర్వాత కంపెనీ వీసా కాదని, విజిట్‌ వీసా ఇచ్చి పంపినట్లుగా విజయ్‌కుమార్‌ గ్రహించాడు. ఏజెంట్‌ పోశెట్టి విజిట్‌ వీసా ఇచ్చి మోసం చేశాడని విజయ్‌కుమార్‌ భార్య ఫిర్యాదు చేసింది. దీంతో పోశెట్టిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుస్మిత తెలిపారు.


కుమార్తె నితారాతో అక్షయ్ కుమార్

సైబర్ వలయం

ముందే పాఠం నేర్చుకుందాం

**ఇప్పుడు ప్రపంచం వైఫైలో బందీ!
ఆ వైఫైయే సెల్‌ఫోన్‌కు ఆహారం..
ఆ సెల్‌ఫోనే అందరికీ ప్రాణాధారం!
రియల్ లైఫ్ కన్నా వర్చువల్ వరల్డ్‌లోనే శ్వాసిస్తున్నాం!
పిల్లలకైతే చెప్పక్కరలేదు..
చదువు - సంధ్య, ఆట - పాట అంతా డిజిటల్ డివైజే!
అందుకే ఆన్‌లైన్‌లో అవతలివైపు వాళ్లకు
అవలీలగా దొరికిపోతున్నారు..
ఆటవస్తువులుగా మారుతున్నారు!
ఈ ప్రమాదానికి సెలబ్రిటీల పిల్లలూ వల్నరబులే..
ప్రైవసీ కంచె వాళ్లను కాపాడలేకుంది!
తాజా ఉదాహరణ.. బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్
కూతురు నితారా కుమార్‌కు ఎదురైన అనుభవమే!**

అక్షయ్ కుమార్ కూతురు నితారాకు పద మూడేళ్లు. అందరి పిల్లల్లాగే ఆ అమ్మాయికీ ఆన్‌లైన్ గేమ్స్ అంటే మహా ఇష్టం. అమ్మ ట్వింకిల్ ఖన్నా అనుమతితో రోజులో కొంచెంసేపు ఆన్‌లైన్ గేమ్స్‌తో ఎంటర్‌టైన్ అవుతూంటుంది. ఎప్పటిలాగే ఆ రోజూ గేమ్‌స్టార్ట్ చేసింది. అవతలి వైపు నుంచి ఓ అపరిచితుడు అమ్మాయికి గేమ్ పార్ట్‌నర్‌గా చేరాడు. గేమ్ ఆడుతూ నితారాతో సంభాషణ మొదలుపెట్టాడు. 'చాలా స్మార్ట్‌గా ఆడుతున్నావ్.. వెరీ గుడ్' అంటూ ప్రశంసించాడు. 'థాంక్స్' చెప్పింది నితారా. ఇంకో రెండుమూడు క్యాజువల్ మాటల తర్వాత 'నువ్వు అమ్మాయివా? అబ్బాయివా?' అంటూ అడ్వాన్స్ అయ్యాడు. 'అమ్మాయిని' అంటూ బదులిచ్చింది నితారా. 'ఒకసారి నీ ఫొటోగ్రాఫ్స్ పంపవా?' అని అడిగాడు. ఏదో అపశ్రుతి పసిగట్టిన ఆ అమ్మాయి వెంటనే డివైజ్ షట్‌డౌన్ చేసి, విషయాన్ని తల్లికి చెప్పింది. 'నా కూతురు చేసిన తెలివైన పని అదే. డివైజ్ క్లోజ్ చేసి ఆ ఆన్‌లైన్ అబ్యూజ్‌ను తల్లితో షేర్ చేసుకోవడం' అంటాడు అక్షయ్ కుమార్. సైబర్ అవేర్‌నెస్ మంత్ క్యాంపెయిన్‌లో మాట్లాడుతూ తన కూతురు ఎదుర్కొన్న పరిస్థితిని వివరించాడు అక్షయ్ కుమార్.


సుహానా ఖాన్, షారూఖ్ ఖాన్, గౌరీఖాన్


అజయ్ దేవ్‌గన్, నైసా, కాజోల్


అభిషేక్, ఐశ్వర్య, ఆరాధ్య


అనుష్క, విరాట్, వమికా

పాఠ్యాంశంగా..

అక్షయ్, ట్వింకిల్ ఖన్నా ఇద్దరూ క్రమశిక్షణకు మారుపేరు. పిల్లలిద్దరినీ మీడియాకు దూరంగానే ఉంచుతారు. వాళ్ల ప్రైవసీకే ప్రాధాన్యం ఇస్తారు. అయినా నితారా ఆన్‌లైన్ అబ్యూజ్‌ను ఎదుర్కొంది. అంత కంటికి రెప్పలా కాచుకుంటేనే ఇలాంటి సిచ్యుయేషన్ వస్తే.. తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలు చేసే ఇళ్లల్లో పిల్లల సంగతి ఎలా ఉంటుందో! 24 గంటలు కాదు కదా.. కనీసం ఇంట్లో ఉన్నప్పుడు కూడా పర్యవేక్షించలేనంత బిజీగా ఉంటున్నారు పేరెంట్స్. అందుకే స్కూళ్లలో సైబర్ సేఫ్టీని పాఠ్యాంశంగా చేర్చాలంటున్నాడు అక్షయ్ కుమార్.

ఎందుకంటే పిల్లల స్క్రీన్ టైమ్ మీద నియంత్రణ లేకపోతే సైబర్ ట్రోలింగ్, బుల్లీయింగ్, అబ్యూజ్‌కి గురయ్యే ప్రమాదం ఎలాగూ ఉంటుంది. దానితో పాటు అది పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యం పై, వాళ్ల సోషల్ బిహేవియర్ మీదా దుష్ప్రభావం చూపిస్తుందని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కాబట్టి అక్షయ్ కుమార్ చెప్పినట్టు పిల్లలకు బడిలో పుస్తక పాఠాలతో పాటు సైబర్ బిహేవియర్ జాగ్రత్తలనూ నేర్పించాలని చైల్డ్ సైకాలజిస్టులూ సూచిస్తున్నారు. అంతేకాదు పెద్దలకూ ఆన్‌లైన్ అవేర్‌నెస్ మీద వర్క్‌షాప్స్‌ను నిర్వహించాలని.. సైబర్ క్రైమ్ పోలీసులే దీని మీద చొరవ చూపాలని కోరుతున్నారు.

కనీస అవసరాల నుంచి ఫ్లయిట్ టికెట్స్ దాకా, బడి పాఠాల నుంచి ప్రొఫెషనల్ మీటింగ్స్ దాకా అన్నిటికీ ఆన్‌లైనే మాధ్యమం. అలాంటి ఈ డిజిటల్ యుగంలో పిల్లల జోక్యాన్ని నివారించడం అసాధ్యమే. కానీ దాని మంచి చెడు, వ్యక్తిగత డేటాను ఎలా కాపాడుకోవాలి, ఆన్‌లైన్ భద్రత కోసం ఏం చేయాలి.. వంటి అంశాల మీద అవగాహన కల్పించడం మాత్రం సాధ్యమే! అత్యవసరం కూడా!

వీళ్లు కూడా..

షారూఖ్ ఖాన్ కూతురు సుహానా ఖాన్ నుంచి కాజోల్, అజయ్ దేవ్‌గన్‌ల కూతురు నైసా దేవ్‌గన్, ఐశ్వర్య రాయ్, అభిషేక్ బచ్చన్‌ల కూతురు ఆరాధ్యా బచ్చన్, అనూష్కా శర్మ, విరాట్ కోహ్లీల కూతురు పసికూన వమికా దాకా అందరూ ఆన్‌లైన్ ట్రోలింగ్, బుల్లీయింగ్‌కి గురైనవారే. సుహానా ఖాన్ ఒంటి రంగు, యాక్టింగ్ స్కిల్స్‌ను వెక్కిరిస్తూ ట్రోల్ చేశారు. నైసా దేవ్‌గన్ కూడా ఒంటిరంగు పట్ల ఆన్‌లైన్ హేళనకు గురైంది. ఆరాధ్యనయితే బాడీషేమింగ్ చేశారు. కెమెరా ముందు నిలబడటం రాదని ఎద్దేవా చేశారు. దీన్ని సీరియస్‌గా తీసుకుని ఐశ్వర్య సైబర్ పోలీసులకు ఫిర్యాదూ చేశారు. ఆ మాటలు, వెక్కిరింతలు ఆరాధ్య మనసును గాయపరచి ఆమె మానసిక ఆరోగ్యాన్ని ఎఫెక్ట్ చేస్తాయని.. ఐశ్వర్య కూతురిని డిజిటల్ మాధ్యమానికి దూరంగా ఉంచారు. కనీసం ఫోన్ కూడా వాడదు ఆరాధ్య. ఈ విషయాన్ని ఒక సందర్భంలో స్వయంగా అభిషేక్ బచ్చనే ప్రస్తావించారు. భార్యకు బెస్ట్ మదర్‌గా కితాబూ ఇచ్చారు. నటులు దియా మిర్జా, సమీరా రెడ్డి కూడా పేరెంట్స్‌గా.. పిల్లల స్క్రీన్ టైమ్ మీద నియంత్రణ ఉండాలని, దాన్నెలా ఫాలో కావాలో, పేరెంటింగ్‌లో ఎలా భాగం చేయాలో పేరెంట్స్‌కి నిపుణులు వర్క్‌షాపులు నిర్వహించి అవగాహన పెంపొందించాలని కోరుతున్నారు.





ఫ్యాషన్

● ఇయర్ చెయిన్స్

మెరిసే సరాలు





**రమణుల ఆభరణాల అలంకరణలో చెవుల నుంచి హెయిర్ వరకు లేయర్లుగా చెయిన్ ఉండటం ఫ్యాషన్ మాత్రమే కాదు మన సంస్కృతి, సౌందర్యం, ఆచారం కూడా.
దక్షిణ భారతదేశంలో చెంపసరాలు, మాటీలుగా పేరున్న ఈ ఇయర్ చెయిన్స్ బాలీవుడ్ నుంచి టాలీవుడ్ సెలబ్రిటీల వరకు ఇప్పుడు స్పెషల్ అట్రాక్షన్‌గా మారాయి.
ఇటీవల దుర్గా నవరాత్రుల్లో సెలబ్రిటీలు ధరించిన మాటీల అందం నవతరపు చూపులను ఇట్టే కట్టిపడేసింది.
ప్రాచీన ఆభరణంగా, అలంకరణలో సంపూర్ణతకు చిహ్నంగా నిలిచే మాటీలు వివాహ వేడుకలలో వధువు సింగారంలో తప్పనిసరై వెలుగొందుతోంది.
పండగల రోజులలో ధరించిన డ్రెస్సుల తగిన ట్రెండీ మోడల్స్ కూడా ఇప్పుడు మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి.
బంగారం, డైమండ్స్‌లోనే కాదు వివిధ రకాల పూసలు, సిల్వర్, ఆక్సిడైజ్‌లలోనూ ఈ మాటీల అందం మనసు దోచేస్తుంది.**






సాంప్రదాయ ఆభరణాలకు మోడర్న్ మెరుపులు జోడించడమే ఈ ఇయర్ చెయిన్స్. ఒకప్పుడు దేవతల విగ్రహాల్లో, అమ్మమ్మల చెవులకు కనిపించిన చెంప సరాలు ఇప్పుడు రన్ వే వేదికలపై అడుగులు వేసే మోడల్స్ చెవుల్లో, మ్యాజిక్ ఫెస్టివల్ లుక్స్‌లో, బ్రైడల్ ఫొటోషూట్లలో కొత్త శైలిలో మెరిసిపోతున్నాయి. దక్షిణ భారతీయ సంప్రదాయాల్లో చెంప సరాలు (ఇయర్ చెయిన్)ఒక ముఖ్యమైన అలంకారం. నాటి కాలంలో మహిళల గౌరవం, ఆభరణ సంపూర్ణతకు చిహ్నంగా వెలుగొందిన చెంప సరాలు రాబోయే వేడుకలలో మరిన్ని ఆకర్షణలను జోడించనున్నాయి.

■ అద్దుకున్న ఆధునికత

ఈ రోజుల్లో ఆ చెంప సరాలు కొత్త రూపాల్లో కనిపిస్తున్నాయి. సిల్వర్, ఆక్సిడైజ్డ్, మెరూన్ కలర్ పూసలు, ముత్యాల చెయిన్లు, ఫ్యూషన్ ఫ్యాషన్‌లో కూడా ఇయర్ చెయిన్స్ స్పెషల్ లుక్ ఇస్తున్నాయి. సాదా సీదా కుర్తా మీదకైనా, లెహంగా లేదా చీర ధరించినా ఆభరణాల అలంకరణలో ఇయర్ చెయిన్ అందం జత చేరితే ఆ అందం ఇనుమడిస్తుంది.

■ శక్తి సరాలు..

ఇది కేవలం అలంకారం కాదు. చెవులు-జుట్టు ప్రదేశంలో ఈ సరాలు కదలడం మన ప్రాణశక్తిని సమతుల్యం చేస్తుందని చెబుతారు. అందుకే కొంతమంది దీనిని 'శక్తి సరాలు'గా భావిస్తారు.


■ సెలబ్రిటీల స్టైల్ టచ్

బాహుబలి సినిమాలో అనుష్క ధరించిన చెవి జూకాలు, చెంప సరాలు ఎంతో మందిని ఆకట్టుకున్నాయి. అలాగే, ఇటీవల దుర్గా నవరాత్రుల్లో బాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకు సెలబ్రిటీలైన అలియా భట్, జాన్వీకపూర్, సోనమ్‌కపూర్, శోభిత ధూళిపాల, నయనతార... లాంటి నటీమణులు తమ ట్రెడిషనల్ ఫొటోషూట్లలో ఇయర్ చెయిన్స్ ధరించి ట్రెండ్ సెట్ చేశారు. ఆ లుక్స్ వల్లే ఈ పాత ఆభరణం మళ్లీ యంగ్ జనరేషన్‌లో పాపులర్ అయింది. పాత ఆభరణానికి కొత్త రూపం దక్కింది. ఇప్పుడు వాటి డిజైన్, మెటీరియల్, వాడుక అన్నీ ఫ్యాషన్ ప్రపంచంలో కొత్త భాషను పరిచయం చేస్తున్నాయి.

ఇప్పుడు కొంతమంది కళాకారులు రీసైకిల్ మెటల్, హ్యాండ్ మేడ్ ఫ్యాబ్రిక్ థ్రెడ్స్‌తోనూ వీటిని రూపొందిస్తున్నారు. అమ్మమ్మల నాటి సంప్రదాయ నెమలి, మామిడిపిందెల నుంచి ప్రారంభమైన చెంప సరాల డిజైన్లు ఈ రోజుల్లో ఇయర్ కఫ్స్ వరకు వినూత్నంగా కళ్లకు కడుతున్నాయి.

కేర్‌గివర్

రాణి అనే నేను ఇజ్రాయెల్ నుంచి మాట్లాడుతున్నాను...



ఇజ్రాయెల్ అనే మాట వినిపించగానే యుద్ధబీభత్సాలు, దాడులు గుర్తుకు వస్తాయి. కొద్దిమంది నెటిజనులకు మాత్రం ఇజ్రాయెల్ అనగానే టక్కున గుర్తుకు వచ్చే పేరు రాణి గోర్సైర. 'ఇజ్రాయెల్‌లో కేర్‌గివర్‌గా పనిచేస్తున్నాను' అని చెప్పే రాణి సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటుంది.

ఎప్పటికప్పుడూ ఆసక్తికరమైన వీడియోలు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తుంటుంది.

'కేర్‌గివర్'గా వృద్ధులను కన్నబిడ్డలా చూసుకుంటుంది. ఇళ్లు శుభ్రం చేయడం, వంట చేయడం, వృద్ధులతో కబుర్లు చెప్పడం... ఇలా ఎన్నో చేస్తూ ఉంటుంది.


'కేర్‌గివర్‌గా నా జీవితంలో ఒకరోజు' కాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన వీడియోలో కబుర్లు చెబుతూ, నవ్విస్తూ, ఒక వృద్ధురాలి కాళ్లని శుభ్రం చేయడం, నెయిల్ పెయింట్ వేయడం.. .మొదలైన దృశ్యాలు కనిపిస్తాయి.

నవరాత్రి ఉత్సవాలలో ఉత్సాహంగా నృత్యం చేయడం మరో వీడియోలో కనిపిస్తుంది.

'చాలామంది వృద్ధులు ఒంటరితనం అనే దీవిలో దిగులుగా జీవిస్తున్నారు. అలాంటి వారికి రాణిలాంటి వారు సరికొత్త జీవనోత్సాహాన్ని ఇస్తున్నారు. వృత్తిపరంగా ఆమె కేర్‌గివర్ కావచ్చు గానీ వృద్ధులకు ఆమె ఆత్మీయతను పంచే కన్నకూతురు' అని ఒక నెటిజన్ కామెంట్ రాశారు.

నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

మనసు మాట విందాం!



మన సమాజంలో దగ్గు, జలుబు, జ్వరం, షుగర్, బీపీ అంటే వెంటనే డాక్టర్ దగ్గరకు వెళ్తారు. కానీ డిప్రెషన్, ఆందోళన, పానిక్ అటాక్, డీ-పర్సనలైజేషన్ లాంటి వాటిని బలహీనతలు లేదా అలసత్వంగా చూస్తారు. అవేవో బాధితులు కావాలని తెచ్చిపెట్టుకున్నట్టు భావిస్తారు. కానీ నిజానికి మానసిక ఆరోగ్యం కూడా శారీరక ఆరోగ్యంతో సమానమే. ఇవి రెండూ పరస్పర ఆధారితాలు.

తలనొప్పి, తల తిరుగుడు, వాంతులు, జీర్ణ సంబంధ ఇబ్బందులు, గుండె అత్యంత వేగంగా కొట్టుకోవడం, ముఖ కండరాలు అదరడం, చర్మం పాలిపోవడం లాంటి శారీరక లక్షణాల ద్వారా మానసిక వ్యాధులు వ్యక్తం అవుతాయి. అంటే, మనసు తాను అనుభవించే హింసను గుర్తించమని, త్వరగా ఈ బాధను తగ్గించే ఉపాయం చూడమని శరీరం ద్వారా వేడుకుంటుంది! కానీ పట్టించుకోం మనం. ఎందుకంటే, బాధితులు ఆ వ్యాధులకు సంబంధించిన మందులు తీసుకుంటే వాటికి బానిసలవుతారని, ఈ వ్యాధులు పూర్తిగా నయం కావనీ. నిజానికి ఇవన్నీ తప్పుడు భావనలు.

మానసిక వ్యాధులు కూడా శారీరక వ్యాధుల్లానే అనేక కారణాల వల్ల రావచ్చు. మెదడు రసాయనాల అసమతుల్యత, వంశపారంపర్యం, ఒత్తిడి, పరిసరాలు వంటి అంశాలు దీనికి కారణం అవుతాయి. కనుగొనదగిన కారణాలు ఏమీ లేకుండా కూడా మానసిక వ్యాధులు రావచ్చు. తొలిదశలోనే వ్యాధిని గుర్తించి సరైన చికిత్స చేస్తే, బాధితులు సాధారణ జీవితం గడపవచ్చు.

పిల్లలు, యువకులు, పెద్దలు ఎవరికి అయినా మానసిక సమస్యలు రావచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం, 2021లో ప్రపంచంలో సుమారు 1.1 బిలియన్ మంది మానసిక వ్యాధుల బారినపడ్డారు (ప్రతి ఎనిమిది మందిలో ఒకరు) అసలు మీరు పని చేసేచోట, సంచరించే చోట మీకు తెలియకుండా ఇప్పటికే ఒకరిద్దరు డిప్రెషన్‌తోనో, ఏంగ్జయిటీతోనో వుండి ఉండొచ్చు. రోజువారీ జీవితంలో అవరోధం కలగనంతవరకూ పరవాలేదు. సమస్య వస్తే మాత్రం, దాచుకోవడం కంటే కుటుంబ సభ్యుల, స్నేహితుల, సహకారం తీసుకోవడం, వైద్యుని సంప్రదించడం ఎంతో అవసరం.

అన్నిటికన్నా ముఖ్యమైన సంగతి, మానసిక ఆరోగ్య సమస్యలు ''నిజమైనవి'' అనే విషయాన్ని గ్రహించడం, అంగీకరించడం. జ్వరం వస్తే విశ్రాంతి తీసుకుంటాం కదా! అలాగే, మనసు అలసిపోయినప్పుడు, అది బాధపడినప్పుడు కూడా సహాయం కోరడం సిగ్గుపడాల్సిన విషయం కాదు. ధైర్యం, అవగాహన అవసరమయ్యే విషయం. మనసుని ఖాళీగా ఉంచకుండా మంచి వ్యాపకాలు పెట్టుకోవాలి. గ్రౌండింగ్ టెక్నిక్స్, బ్రీతింగ్ వ్యాయామాలు నేర్చుకోవాలి..

సర్వమానవ సహోదరత్వం, సౌభ్రాతృత్వం గురించి ఉపన్యాసాలు దంచేస్తాం. మనలో అది నిజంగా వుందని నిరూపించుకునే చిన్న అవకాశం ఒకటి ఏమిటంటే, మానసిక వ్యాధులతో బాధపడేవారిని చూసి ఎగతాళిగా నవ్వకుండా, తప్పుగా మాట్లాడకుండా ఉండటం, వాళ్లకి చేతనైన సహాయం చెయ్యడం.

ఆమాత్రం చేయలేమా?

ప్రపంచ ప్రసిద్ధ వ్యక్తుల్లో అబ్రహాం లింకన్, ఐజాక్ న్యూటన్, విన్సెంట్ వ్యాన్గో, చార్లెస్ డికెన్స్ నుంచీ మన దీపికా పదుకొనే వరకూ ఎందరో గొప్ప వ్యక్తులు, సెలబ్రిటీలు మానసిక వ్యాధులతో పోరాడి, సాధారణ స్థాయిని మించి ఉన్నతంగా బతకడమే కాకుండా, తమ ప్రతిభతో లోకానికి ప్రేరణగా నిలిచారు. మానసిక రోగులు చాలా వరకు ప్రమాదకారులు కాదు; మందులు వైద్యుని సూచన మేరకు తీసుకుంటే అడిక్షన్ రాదు.


వైష్ణవి గద్దె, వైద్య విద్యార్థిని

జర్నీ

భారత్ పిలిచింది!



బ్రెయిన్ ట్యూమర్ బారిన పడిన యూకే అథ్లెట్ జాక్ ఫెంట్‌కు ప్రతికూల ఆలోచనలు వస్తుండేవి. ఆ సమయంలోనే తనకు ఇష్టమైన ఇండియా గుర్తుకు వచ్చింది. వెంటనే రంగంలో దిగాడు.

'ఇండియా-80 రోజులు-4,000 కిలోమీటర్‌లు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టాడు.

ఇండియాలోకి అడుగు పెట్టిన క్షణం నుంచి అతడిలో ఉత్సాహం మొదలైంది. ఇండియాలో తన '80-డే రన్' తాలూకు వీడియోలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నాడు. 'ప్రొటెక్టర్' కాప్షన్‌తో పోస్ట్ చేసిన వీడియోలో తనను ప్రమాదం నుంచి రక్షించిన వీధి శునకం గురించి చెప్పాడు.

ఆ శునకంతో తనతోపాటు పదమూడు కిలోమీటర్‌లు నడిచింది. దానికి 'మనాలి' అని పేరు పెట్టాడు జాక్.

'80 రోజులలో రోజుకు 50 కిలోమీటర్‌ల దూరం పరుగెత్తడానికి ఇండియాకు ప్రయాణమవుతున్నాను. మంచుతో కప్పబడిన కొండల నుంచి కేరళ ప్రకృతి అందాల వరకు ఎన్నో చూడబోతున్నాను. బ్రెయిన్ ట్యూమర్ అని నాకు నిర్ధారణ అయిన తరువాత నా మనసు భయం, గందరగోళం, దుఃఖంతో నిండిపోయింది. నాకే కాదు భూమి మీద ప్రతి ఒక్కరికీ కష్టాలు కూడా ఉంటాయి. దీంతో పాటు ఒక ఆప్షన్ కూడా ఉంటుంది. ఇండియాకు వెళ్లాలనుకోవడం అనేది నా ఎంపిక. మళ్లీ పూర్వంలా ఉత్సాహంగా ఉండాలనుకుంటున్నాను'' అని తన యాత్ర ప్రారంభానికి ముందు షేర్ చేసిన పోస్ట్‌లో రాశాడు జాక్ పెయింట్.

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
అక్టోబర్ 10న ముగింపు రూ.లలో

నగరం	బంగారం (24 క్యారెట్లు)	బంగారం (22 క్యారెట్లు)	వెండి
హైదరాబాద్	1,29,410	1,17,340	1,70,000
విజయవాడ	1,26,250	1,13,380	1,58,600
విశాఖపట్నం	1,24,150	1,13,800	1,67,000
రాజమండ్రి	1,26,250.	1,17,210	1,58,600
ప్రొద్దుటూరు	1,28,000	1,17,700	1,60,000
చెన్నై	1,24,370	1,14,000	1,71,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.